క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. పుట్టదేవుని, స్వామి దర్శనానంతరం తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దాతల సహకారంతో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించి, ఆరగించారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం



రూ.50 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి ప్రశాంతి మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆమె గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఆమె నివాసంలో ఆలయ నిర్మాణ వ్యవహారాలు చూస్తున్న వారికి రూ.50 వేలు శనివారం అందజేశారు. అనంతరం వారు సత్యసాయి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు.

వైటీసీ ఆవరణలోనే గిరిబజార్ వాహనం



వైటీసీ ఆవరణలో మూలుగుతున్న గిరిబజార్ వాహనం

సీతంపేట: గిరిజనులకు కావాల్సిన నిత్యావసర సరుకులు విక్రయించి వారిని చైతన్యపరచాలనే ఉద్దేశంతో జిల్లాకు రెండు గిరిబజార్ వాహనాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో ఒకటి సీతంపేట ఐటీడీఏకు కేటాయించగా.. ఆ వాహనం పది రోజులుగా వైటీసీ ఆవరణలో మూలుగుతోంది.ఇప్పటివరకు ఒక వారపు సంతకు గాని, గ్రామానికి గాని వెళ్లిన దాఖలాలు లేవు. ఈ విషయమై వెలుగు ఏపీఎం కమల వద్ద ప్రస్తావించగా ఇంకా రూట్‌మ్యాప్ ఇవ్వాల్సి ఉందన్నారు. గిరిజనులకు అవసరమైన సరుకులను సంతల్లో విక్రయించనున్నట్లు చెప్పారు.

వితరణ



చీరలు, దుప్పట్లు అందజేస్తున్న ఫల్గుణరావు

సీతంపేట: గిరిజన సేవా సొసైటీ అధ్యక్షుడు మండంగి ఫల్గుణరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలువురు గిరిజనులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. సుమారు 50 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫల్గుణరావు తెలిపారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గొడు వీధిలో ఉన్న రావాడ రామభద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీకటి శంకరరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరానికి హాజరుకాగా వైద్య సిబ్బంది వారి ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వైద్య సిబ్బంది తెలిపారు.

రెల్లి, ఉప కులాలకు న్యాయం చేయాలి

పార్వతీపురం టౌన్: ఎస్సీ ఏబీసీ వర్గీకరణలో రెల్లి వాటి ఉప కులాలకు సమాన న్యాయం చేయాలని రెల్లి వాటి ఉపకులాల ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ గండి డేనియల్ కోరారు. ఈ మేరకు సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయలకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి వాటి ఉప కులాల వారికి రిజర్వేషన్ శాతం పెంచాలని ఉత్తరాంధ్ర జిల్లాలో మాల మాదిగలతో రెల్లిలు సమానంగా ఉన్నారన్నారు. ఒక్క శాతం రిజర్వేషన్ చాలదని, సుప్రీంకోర్టు వారి సూచనల ప్రకారం రెల్లి వాటి ఉప కులాల వెనుకబాటుతనాన్ని బట్టి రిజర్వేషన్ శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. రెల్లిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేటెడ్ పోస్టులు రెల్లిలకు ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం వారు దళితులను వర్గీకరించి ఒక శాతం రిజర్వేషన్ కల్పించారు. రెల్లి వారి ఉపకులాల జనాభా రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షలకు పైగా ఉన్నారన్నారు. గండికుమార్ మాస్టర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సొండి సంజీవి, జిల్లా రెల్లి కులస్తులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ తనూజరాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఎంపీ తనూజరాణి, మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం:

కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పిలుపునిచ్చారు. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ అని కూటమి నాయకులు లేనిపోని హామీలు ఇచ్చి, ఓటర్లను మభ్యపెట్టారని, ఇప్పుడు అవేవీ అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాడుతామని, ఎన్నికల హామీలు అమలయ్యే వరకు ఊరుకునేది లేదన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి హామీలు అమలు చేయకపోవడాన్ని వివరిస్తామన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను చెబుతామన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌లను విడుదల చేశా రు. సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు..



జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాల కన్నా నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తామని చెప్పి ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారు. ఏ ఒక్క హామీ అమలు చేయకుండానే ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మేనిఫెస్టోను దగ్గర పెట్టుకుని దాని ప్రకారం సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి మరీ పథకాలు ఇచ్చిన ఘనత అప్పటి సీఎం జగనన్నకే దక్కుతుంది. అప్పట్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 99 శాతం హామీలు అమలు చేశారని, ఇప్పుడు ఏడాదైనా కూటమి సర్కారు ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదు. ఇప్పటికే గ్యాస్, తల్లికి వందనం డబ్బులు కొందరికి పడలేదు. సంపద సృష్టిస్తామని, వారి పార్టీ నేతలు, కార్యకర్తలకే సీఎం చంద్రబాబు రాష్ట్ర సంపద దోచిపెడుతున్నారు.

–పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం

జగన్ 2.0 పాలనకు కృషి చేద్దాం..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలన తీసుకువచ్చేందుకు మనమంతా కృషి చేద్దాం. కూటమి అధికారంలోకి వచ్చి 13 నెలల కాలం గడుస్తోంది. ఇప్పటివరకు ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. చంద్రబాబు మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారు. ప్రతి పనిలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాయకులే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పథకాలు ఇస్తే..ఇప్పుడు ప్రజలే పథకాల కోసం ప్రజాప్రతినిధుల గుమ్మం తొక్కాల్సి వస్తోంది. ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం. మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం. ఆ దిశగా మనమంతా పనిచేద్దాం.

–శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు

గడప గడపకూ వివరించాలి..



అధికారం చేపట్టి ఏడాది కాలం గడుస్తున్నా పథకాలేవీ అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును గడప గడపకు వెళ్లి వివరించాలి. చంద్రబాబు పాలనలో ప్రజలు ఏ విధమైన కష్టాలు పడుతున్నారో కళ్లారా చూస్తున్నాం. అవన్నీ ప్రభుత్వానికి తెలిసేలా నిలదీయాలి. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అణగారిన వర్గాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను తెలపాలి. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా కష్టపడి పనిచేయాలి.

–గుమ్మ తనూజారాణి, అరకు ఎంపీ

వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం రేపు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

సీతంపేట: మండల కేంద్రంలో ఈ నెల 14న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బి.ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక నాయకులతో మండల కేంద్రంలో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సమావేశానికి ముఖ్య అతిథులుగా అరుకు ఎంపీ గుమ్మ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హాజరుకానున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిమ్మక కాంతారావు, ప్రధాని, విజయకుమారి, ముకుందరావు, ఎస్.మంగయ్య, చంద్రశేఖరరావు, ఎస్.మహేష్, మురళి, తవిటినాయుడు, సోమేష్, ఎస్.కృష్ణ, బావయ్య, రామారావు, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ అధిష్టానం పంపించిన జాబితాను పార్టీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు శనివారం వెల్లడించారు. పార్టీ యూత్ విభాగం మండల అధ్యక్షుడిగా గెల్లంకి రమేష్.. మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొత్తకోట వెంకటమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా కాగితాపల్లి కృష్ణారావు.. బీసీ సెల్ అధ్యక్షుడిగా వలరౌతు వెంకటరమణ.. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గేదెల మోహనరావు.. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఆరిక తమ్మయ్య.. మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేర్ ఫకీరు.. క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా టింగ ప్రభాకర్.. స్టూడెంట్ విభాగ అధ్యక్షుడిగా తోట లాల్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా మడపాన కేశవ.. ఆర్‌టీఐ విభాగ అధ్యక్షుడిగా మేడిబోయిన చలపతి.. వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా మలగాం కృష్ణ.. వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా కాశిన సూర్యనారాయణ.. వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా రొక్కం బద్రీనాథ్.. వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా పోతల బాలరాజు.. అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా కొండగొర్రి ఉషారాణి.. కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పత్తిక అగ్నేష్.. సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా రొక్కం రమేష్.. దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా అంగూరు వైకుంఠరావు.. పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా బకి నారాయణలను నియమించినట్లు ప్రకటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వీఎల్ నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అదే సబ్జెక్ట్‌లో పీజీ చేసిన అభ్యర్థులు ఈ నెల14వ తేదీలోగా భామిని జీజేసీలో దరఖాస్తులు అందివ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ కార్యాలయం వద్ద గల ఆడిటోరియంలో హాజరుకావాలని కోరారు.

నేడు పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గరుగుబిల్లి: పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ పీఆర్(పంచాయతీరాజ్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక శనివారం జరగనుందని ఆ సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, ఆ షెడ్యూల్ ప్రకారమే ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. జూలై 13న ఉదయం 9 గంటలకు నామినేషన్లు స్వీకరణ, ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహణ ఉంటుందన్నారు. పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, మండలాల పీఆర్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సిబ్బంది అంతా ఎన్నికల్లో పాల్గొనాలన్నారు.

చీరలతో కంచె..



మండలంలోని నేరడి-బిలో కనకాంబరాల సాగు ఎక్కువగా జరుగుతోంది. ఈ పువ్వుల సాగును కాపాడుకునేందుకు రైతులు చీరలను కంచెగా ఏర్పాటు చేసుకున్నారు. రంగు రంగుల చీరలు కంచెగా ఏర్పాటు చేయడంతో చూపరుల దృష్టిని ఆకట్టుకుంటోంది. - భామిని

ఘనంగా నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

సీతంపేట: మండలంలోని పొల్ల గ్రామంలో ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాబార్డ్ ఆవిర్భావ దినత్సోవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ.. నాబార్డ్ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రోత్సహించడానికి పెట్టుబడి, ఉత్పత్తి క్రెడిట్‌ను అందించే సంస్థలకు ఆర్థిక సంస్థగా పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటీర, చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాతోట వన సహజ ఎఫ్‌పీసీ సీఈఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రాజెక్ట్ డాల్ఫిన్ పేరిట శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నదీ జలాలు – సముద్ర జలాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యమంలో భాగంగా ప్రాజెక్ట్ డాల్ఫిన్ ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు ఈఎంఆర్ఎస్ ప్రిన్స్‌పాల్ జి.గంగాదేవి తెలిపారు. ముందుగా విద్యార్థులకు డాల్ఫిన్ జీవిత విశేషాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

నిబంధనలు బేఖాతరు..

- స్కూల్ పరిసరాల్లో ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డులు
- జాడే లేని స్పీడ్ బ్రేకర్లు
- వేగం తగ్గించని వాహనదారులు
- హైస్కూల్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

వీరఘట్టం:

స్కూల్ జోన్‌లు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.. వాహనాలు పరిమిత వేగంతో రాకపోకలు సాగించాలి.. తప్పనిసరిగా స్పీడ్ బ్రేకర్లు, క్రాసింగ్ లైన్లు వేయాలి.. కాని ఈ నిబంధనలేవీ మండల కేంద్రంలోని పాఠశాలల పరిసరాల్లో పాటించడం లేదు. స్థానిక బాలుర, బాలికోన్నత పాఠశాల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 10న జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ డేకు వస్తున్న బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.లక్ష్మిని స్కూటీ ఢీ కొట్టడంతో బాలిక కుడికాలు విరిగిపోయింది. ప్రస్తుతం ఈ బాలిక పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతునే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు రోడ్డు పక్కన స్కూల్స్ ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు.

ఇదీ పరిస్థితి..

వీరఘట్టం వట్టిగెడ్డ దాటిన నుంచి నడుకూరు గ్రామం దాటే వరకు సీఎస్పీ రోడ్డుకు ఇరువైపులా ఆరు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వీటితో పాటు తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలు కూడా ఉన్నాయి.అలాగే ఎంఈఓ కార్యాలయం, విద్యుత్‌శాఖ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయాలున్నాయి. అలాగే ఓ పెట్రోల్ బంక్, వ్యాపార సముదాయాలు కూడా ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు కిలోమీటర్ పొడవునా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. దీంతో ఈ పరిసరాల్లో పరిమిత వేగంతో ప్రయాణం చేయాలనే బోర్డులను ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాక వాహనదారులకు, విద్యార్థులకు రోడ్డు భద్రాతా నియమాలపై అవగాహన కల్పించాలి. అయితే ఇక్కడ అటువంటి ప్రక్రియ లేవీ జరగకపోవడంతో రోడ్డు ప్రమాదాలుజరుగుతూనే ఉన్నాయి.

పేరుకుపోయిన పిచ్చి మొక్కలు..

వట్టిగెడ్డ వంతెన దాటిన తర్వాత నడుకూరు గ్రామం వరకు సుమారు కిలోమీటర్ పొడవునా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. ఈ పిచ్చి మొక్కల నుంచి తరచూ విష సర్పాలు రోడ్డుపైకి వస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



వీరఘట్టం సీఎస్పీ రోడ్డు పక్కనే ఉన్న బాలికోన్నత పాఠశాల



సీఎస్పీ రోడ్డుకు ఆనుకుని ఉన్న బాలుర ఉన్నత పాఠశాల



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పరిమిత వేగంతో ప్రయాణం చేయాల్సింది ఇక్కడే

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం..

వీరఘట్టం వట్టిగెడ్డ దాటిన తర్వాత నడుకూరు వరకు విద్యా సంస్థలు ఉన్నాయి. ఇక్కడ స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తాం.

– టి.కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ, ఏఈ, పాలకొండ

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులాహ్వానం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జూనియర్ కళాశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రవణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అర్హులై ఉండి ఆసక్తి ఉన్న వారంతా 14వ తేదీ సాయంత్రం 2 గంటలకు దరఖాస్తు అందజేయాలని, అదేరోజు సాయంత్రం 6 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. రిటైర్డ్ అయిన వారికి ప్రాధాన్యముంటుందన్నారు. దరఖాస్తుదారులకు ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటలకే ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం ఆడిటోరియంలో డీఐఈవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూఉంటుందన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ..

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జంతుశాస్త్రం (జువాలజీ) సబ్జెక్ట్ బోధించేందుకు (గెస్ట్ ఫ్యాకల్టీ) ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక పూజలు

బలిజిపేట: బలిజిపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు హరి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకుడు సురేష్ స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని తులసిదళాలు, మందార పువ్వులతో అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. స్వామివారికి తులసి దళాలను భక్తులు సమర్పించారు.